హయత్‌నగర్ బస్‌స్టాండ్‌లో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, చిత్రంలో డిపో మేనేజర్ విజయ్

మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగించుకోవాలి

హయత్‌నగర్, డిసెంబర్ 9: తెలంగాణ ప్రభుత్వం మహిళా ప్రయాణికుల కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హెచ్.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం హయత్‌నగర్ ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో డిపో-1 మేనేజర్ జలగం విజయ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం(మహాలక్ష్మి) పథకాన్ని సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు పూలతో స్వాగతం పలికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయకుమారి, ఎంఎఫ్ చందర్, మైస నరేశ్, జంగయ్య, సయ్యద్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

మహేశ్వరంలో జెండా ఊపి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న మోడల్ స్కూల్ టీచర్ వెంకటలక్ష్మి, డిపో మేనేజర్ ఎం.మోహన్‌రెడ్డి తదితరులు

మహేశ్వరం, డిసెంబర్ 9: మహేశ్వరం మండల కేంద్రంలో మహిళలకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు మోడల్ స్కూల్ టీచర్ వెంకటలక్ష్మి, డిపో మేనేజర్ ఎం.మోహన్ రెడ్డితో కలిసి జెండాను ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నర్సయ్య, ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా దుబ్బచెర్ల ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లను పంపిణీ చేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూరి రాజు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు ఇమ్మడి ప్రవీణ్, నాయకులు షరీఫ్, సుధాకర్, రమేశ్, రాఘవేందర్, జగదీశ్, రఘుపతి, గణేశ్, శివ, బాల్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

– మహేశ్వరం, డిసెంబర్ 9

ఇక స్థానిక సంగ్రామం

- వచ్చే నెల 31తో పాలకవర్గం గడువు ముగింపు
- పంచాయతీ ఎన్నికలకు మొదలైన కసరత్తు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- రిజర్వేషన్ల వివరాలు సేకరించిన ఈసీ
- 'టీ-పోల్'లో సిబ్బంది వివరాలు
- నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ

పంచాయతీ భవనం

కందుకూరు, డిసెంబర్ 9 : అసెంబ్లీ ఎన్నికల సమరం ముగిసింది. ఇక స్థానిక సంగ్రామం షురూ కానున్నది. వచ్చే ఏడాది జనవరి 31వ తేదీన సర్పంచుల పదవీ కాలం ముగియనుండటంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలకు కసరత్తు ముమ్మరం చేసింది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను టీపోల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల వారీగా అమల్లో ఉన్న రిజర్వేషన్ల వివరాలను జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సేకరించింది. ఓటర్ల జాబితాను జీపీ, వార్డుల వారీగా విభజించి.. అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను ప్రకటించనున్నది. ఈ ప్రక్రియను నెలరోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నది. కందుకూరు మండల పరిధిలోని 35గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. తమ పంచాయతీ, వార్డు ఏ రిజర్వేషన్ వస్తుందోనని నేతలు ఆశాగా ఎదురుచూస్తున్నారు. పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు రిజర్వేషన్ల విషయంలో తర్జన బర్జన పడున్నారు. మొత్తం మీద అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన అనంతరం పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం చేస్తుండటంతో గ్రామాల్లో మరో మారు రాజకీయం వెడెక్కుతుంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికలపై చర్చించుకుంటున్నారు. కందుకూరు మండల పరిధిలో ఉన్న 35 గ్రామపంచాయతీల్లో బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. ఇక పల్లెల్లో ఎన్నికల సందడి మొదలుకానున్నది.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, డిసెంబర్ 9: ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. శనివారం హయత్‌నగర్ డివిజన్‌లోని అయ్యప్పకాలనీలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆరోగ్య భారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారి ఆహార శైలి కూడా మానవ జీవనానికి పెను ప్రమాదంగా మారిందన్నారు. చిన్నపెద్ద తేడా లేకుండా ప్రతి రోజూ వ్యాయామం, యోగా చేయడం వల్ల ఉత్సాహంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేశ్, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

మహేశ్వరం, డిసెంబర్ 9: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శనివారం శివగంగ దేవాలయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవాలయంలో కొబ్బరి కాయలను కొట్టి కేసీఆర్ త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి రావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దుడ్డు కృష్ణ యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ కడమోని ప్రభాకర్, మాజీ సర్పంచ్ ఆనందం, నాయకులు నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, నవీన్, వీరిబాబు, మహేందర్, బొట్టు శ్రీనివాస్, కృష్ణ, రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.